
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.0	24.0

వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి
..8లో



నివాళులర్పిస్తున్న ఎస్పీ జగదీశ్

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పించిన ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మహనీయుడు డా.బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గం అనుసరణీయమని, ఆయన జీవితం ఆదర్శనీయమని ఎస్పీ జగదీశ్ కొనియాడారు. అంబేడ్కర్ 133వ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎస్పీ జగదీశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే ఈ రోజు భారతజాతిని నడిపిస్తోందన్నారు. మహామేధావిగా, సంఘ సంస్కర్తగా, న్యాయశాస్త్ర కోవిదుడిగా ఆయన కీర్తి గడించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని చెప్పారు. సమాజ సేవకు ప్రతిఒక్కరూ అంకితం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనిల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, టి.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ డి.ప్రభాకర్, సీఐ సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న పురందేశ్వరి



అంబేడ్కర్ ఆశయాలకు జగన్ తిలోదకాలు

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తిలోదకాలు ఇస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పురందేశ్వరి, తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం డాక్టర్ అంబేడ్కర్ కలలు కన్నారని, అంబేడ్కర్ ఆశయాలను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాజ్యాంగంలో ప్రాధాన్యం కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ అంబేడ్కర్ మహాశయుడు బడుగు, బలహీనవర్గాలు, మహిళలు కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు వెళ్లాలని సూచించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్, దున్న సుమన్‌బాబు, సీహెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన వైసీపీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

వైసీపీ నేతలు మరోసారి రోడ్డెక్కారు. ఈసారి ఏకంగా దెబ్బలాటకు దిగారు. కొవ్వూరులో ఆదివారం జరిగిన ఓ సమావేశం రసాభాసగా మారిన సంగతి తెలిసిందే.. తెలుగుదేశం పార్టీ జిల్లాలో అసంతృప్తులుగా ఉన్నవారినందరినీ సముదాయించి, పరిస్థితిని చక్కదిద్దుకుని, ప్రజల ముందుకు కూటమిగా దూసుకుపోతుంటే, అధికార వైసీపీకి మాత్రం ఇప్పటికీ ఇంటి పోరును సర్దుకోలేక పోతోంది. ఇప్పటికీ కనువిప్పు కలగలేదు. ఇప్పటికే అధికార వైసీపీ మీద ప్రజలకు పీకలవరకూ వ్యతిరేకత, తీవ్ర అసంతృప్తి ఉన్న సంగతి తెలిసిందే. అన్ని వర్గాలలో ఈ ప్రభుత్వ వైఖరిపై తిరుగుబాటు ధోరణి కనిపిస్తోంది. ఏదో కులాల పేరుతో పార్టీలలో చిచ్చుపెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నా, ఈసారి ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ధోరణితోనే కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ నేతలు ఐక్యంగా ఉండి ప్రజల మన్ననలు పొందే ప్రయత్నం చేయాలి.



కొవ్వూరులో వైసీపీలోని ఇరువర్గాల మధ్య కొట్లాట

కూటమిలో సర్దుబాట్లు..వైసీపీలో కుమ్ములాటలు



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలను ఆకర్షిస్తూ పోతుంటూ, ఈసారి కాంగ్రెస్ పార్టీ కూడా ఒక ఊపుతో ప్రచారం చేసుకుంటూ కొన్ని వర్గాలనైనా, చివరకు కొన్ని ఓట్లయినా కూడగట్టుకుని బలోపేతం కావాలని ప్రయత్నం చేస్తుంది. కానీ అధికార వైసీపీ మాత్రం వర్గాలు, గ్రూపులు కుమ్ములాటలతో రోజురోజుకు మరింత దిగజారిపోతోంది. ఈ ఐదేళ్లలోనూ జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ ఉన్నప్పటికీ ఎవరి మధ్య సయోధ్య లేదు. ఎవరి దారి వారిదే. ఆధిపత్య పోరుతో ఒకరిని ఒకరు ఓడించుకునే ఆలోచనకు కూడా రావడం గమనార్హం. ఇవాళ కొవ్వూరులో ఏకంగా కొట్టుకునే స్థాయికి వచ్చారు. అక్కడ గతంలో ఇటువంటి ధోరణి లేదు. ఈనెల 18న సీఎం జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సుయాత్రలో జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.. రాష్ట్రవ్యాప్తంగా జనాలు ఉండడం లేదు. ఈనేపథ్యంలో జనసమీకరణ ఎలా జరపాలి.. గతంలో డ్వాక్రా మహిళలు, పెన్షన్ లబ్ధిదారులను నయానోభయానో రప్పించి, బస్సుల మీద తీసుకుని వెళ్లి, సభలో నిండుగా ఉండేటట్టు చూపించారు. అయినా మధ్యలో వారంతా వెళ్లిపోయేవారు. అప్పట్లోనే అటువంటి పరిస్థితి ఉంటే, ఇవాళ కేవలం పార్టీ క్యాడర్ తప్ప ఇంకెవరొస్తారు. ప్రజలలో అభిమానం ఉంటే వాళ్లయినా వచ్చేవారు. కానీ ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఈ పరిస్థితులలో కొవ్వూరులో జన సమీకరణ కోసం సమావేశమైన నేతల మధ్య ఏకంగా ఘర్షణకే దారి తీయడం అంటే వైసీపీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లా వైసీపీలో
కుమ్ములాటలు తారస్థాయికి
ప్రతి నియోజకవర్గంలోనూ
నాయకుల మధ్య విభేదాలే..
గ్రూపు తగాదాలు, ఆధిపత్య
పోరుతో అభాసుపాలు
నేతల మధ్య కుదరని సఖ్యత
సర్దుకునే దారే లేదు..

ప్రతి నియోజకవర్గంలోనూ ఏదో ఒక సమస్య

గోపాలపురం అభ్యర్థిగా పోటీ చేస్తున్న తానేటి వనిత, ఇక్కడ కొవ్వూరు నుంచి వెళ్లినా, అక్కడ కూడా గ్రూపులు పెడుతున్నారనే వాదన వినిపిస్తోంది. నిడదవోలు అభ్యర్థి శ్రీనివాసనాయుడు పార్టీ శ్రేణులను దగ్గర చేసుకోకుండా ఒంటెద్దు పోకడ ఎక్కువ ఉందనే ప్రచారం కూడా ఉంది. రాజమహేంద్రవరంలో సిటీ అభ్యర్థి ఎంపీ మార్గాని భరత్‌కు, సిటీలోని ముఖ్యనేతల మధ్య సఖ్యత లేదు. వారంతా ఇక్కడ ప్రచారం మానేసి వేరే నియోజకవర్గాలో ప్రచారం చేయడం గమనార్హం. రూరల్ అభ్యర్థిగా వేరే ప్రాంతానికి చెందిన మంత్రి చెల్లుబోయిన వేణును నిలబెట్టడంతో, స్థానికంగా నేతలు లేరా అనే వాదన బీసీ వర్గాలలో కూడా ఉంది. గతం నుంచి టికెట్ల కోసం ప్రయత్నించిన వారంతా పైకి మామూలుగానే ఉన్నా, తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంలో అక్కడ రెండుసార్లు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆకుల వీర్రాజును బలవంతంగా కోఆర్డినేటర్ పదవి నుంచి తొలగించి, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ కుమారుడు చందన నాగేశ్వర్‌కు కోఆర్డినేటర్ పదవి ఇవ్వడంతో పాటు, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇస్తానని దగా చేశారు. దీంతో ఆయన కూడా పైకి తేలకపోయినా అసంతృప్తితో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజానగరంలో జక్కంపూడి రాజాకు సొంత వర్గంలోనే సమస్యలు ఉన్నాయి. అనపర్తి అభ్యర్థి సూర్యనారాయణరెడ్డిని సొంత వర్గంలో కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల కొందరు ముఖ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇలా జిల్లాలో తీవ్ర విబేధాలతో వైసీపీ కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గాలలో ఈ గొడవలు ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు నిద్రలేకుండా చేయడం గమనార్హం.

కొవ్వూరులో వైసీపీ నేతల కొట్లాట



కొవ్వూరులో పరస్పరం దాడులు చేసుకుంటున్న నాయకులు

రోడ్డెక్కి కొట్టుకున్న నాయకులు
వైసీపీలో బయటపడిన వర్గ విభేదాలు
నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్యే ముందు నాయకుల బాహాబాహీ
రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన వైనం

కొవ్వూరు, ఏప్రిల్ 14: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వైసీపీలో మరోసారి వర్గ విభేదాలు బయటపడ్డాయి. గత కొంతకాలంగా నియోజకవర్గంలో చాపకింద నీరులా ఉన్న వర్గాల మధ్య పోరు ఒక్కసారిగా బహిర్గతమయ్యింది. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ముఖ్యమంత్రి మేమంతా సిద్ధం పర్యటన, ఎన్నికలలో తలారి వెంకట్రావు నామినేషన్‌కు సంబంధించి నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో వేదికపై ఒక సామాజికవర్గానికే పెద్దపీట వేస్తున్నారని, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావును ఆహ్వానించరా అని పెద్దేవం ఉప సర్పంచ్ తోట రామకృష్ణ వేదికపైకి నాయకులను ఆహ్వానిస్తున్న వైసీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణను ప్రశ్నించారు. పరిశీలకులు రాజీవ్ కృష్ణ కంగారు పడకండి అందరిని పిలుస్తామని అనడంతో రామకృష్ణ వాగ్వివాదానికి దిగారు. దీంతో రామకృష్ణ పై హోంమంత్రి తానేటి వనితను వ్యతిరేకించిన వర్గం నాయకులు మూకుమ్మడిగా దాడిచేశారు. సాక్షాత్తు నియోజకవర్గ పరిశీలకులు రాజీవ్‌కృష్ణ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావుల ఎదుటే నాయకులు బాహాబాహీకి దిగారు. దీంతో కల్యాణ మండపం నుంచి బయటకు వచ్చేసిన తోట రామకృష్ణపై మరోసారి దాడి జరిగింది. రోడ్డెక్కి మరి కొట్టుకున్నారు. ఈ సంఘటనతో వేదికపై ఉన్న నాయకులంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

ఈ ఘర్షణపై తోట రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి బస్సుయాత్రకు సంబంధించి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. సభా వేదిక పైకి సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగధర శ్రీనివాస్‌లను పిలవలేదన్నారు. వేదికపైకి కాపు సామాజికవర్గం నుంచి ఎవ్వరికి ప్రాధాన్యం కల్పించలేదని ప్రశ్నించానని, మంత్రి వనితను వ్యతిరేకించిన వర్గానికి చెందిన వారంతా మూకుమ్మడి దాడి చేసి షర్ట్ చింపివేశారన్నారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు కలిగిన కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియోజకవర్గ పరిశీలకులుగా నియమించాలని ఇటీవల కాపు సామాజికవర్గ నేతలంతా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను కోరామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కక్ష పూరితంగా దాడి చేశారని తోట రామకృష్ణ చెప్పారు. హోంమంత్రి తానేటి వనితను వ్యతిరేకించిన వారే దాడికి పాల్పడ్డారన్నారు. పరిశీలకులు నియోజకవర్గ పరిస్థితులను గమనించాలన్నారు. నియోజకవర్గంలోని సామాజికవర్గ నాయకులతో చర్చించి సామాజికవర్గానికి జరిగిన అన్యాయంపై భవిష్యత్ కార్యాచరణ తెలియజేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు మాట్లాడుతూ కొవ్వూరు వైసీపీలో కాపు సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఇది సరైంది కాదని అడిగిన తోట రామకృష్ణను ఒక సామాజిక వర్గం నాయకులంతా కలిసి దాడిచేసి దుర్భాషలాడడం సరికాదన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కాపులను విడదీస్తే టీడీపీ గెలుస్తుంది అని కొంతమంది కుట్ర చేస్తున్నారన్నారు.

నాడు కోడి కత్తి..నేడు గులకరాయి

రెండు డ్రామాలనూ రక్తికట్టించిన వైసీపీ
కోడి కత్తి శ్రీనును జైలు పాలు చేశారు
శవరాజకీయం కోసం అవ్వాతాతల ప్రాణాలు తీశారు
జగన్ డ్రామాపై మండిపడ్డ ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: నాడు కోడికత్తి, నేడు గులకరాయి డ్రామాలతో జగన్ ప్రజల్లో సానుభూతిని పొందాలని చూస్తున్నాడని రాజమహేంద్రవరం సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎంపై రాయి విసిరిన తర్వాత అక్కడే నిందితుడిని పట్టుకోలేకపోవడంలో విఫలమైన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సీపీ క్రాంతి రాణా టాటాలను వారి బాధ్యతల నుంచి ఎన్నికల కమిషన్ తొలగించాలని డిమాండ్ చేశారు. సీఎం పర్యటన సమయంలో పదేపదే కరెంట్ సరఫరా నిలిపివేయడం తీవ్రమైన నేరం అని దీనికి బాధ్యులైన ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సంబంధిత విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గులకరాయి దాడిపై ఎన్ఐఏతో విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేత అవుతు శ్రీధర్ రెడ్డి ఈనెల 10న ఫేస్‌బుక్ పోస్టులో నాలుగురోజుల్లో రాష్ట్రంలో సంచలనమైన ఘటనలు జరిగే అవకాశం అనడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అతను చెప్పినట్లే సరిగ్గా నాలుగు రోజున విజయవాడలో సీఎం జగన్‌పై గులకరాయి దాడి జరగడం కోడి కత్తి డ్రామాలాంటి జగన్నాటకం కాదా అని ప్రశ్నించారు. జగన్‌పై గులకరాయి దాడి జరిగినప్పుడు అతని చుట్టు ఉన్న వైసీపీ కార్యకర్తలు, పోలీసులు వెంటనే నేరస్థుడిని ఎందుకు పట్టుకోలేదని ఇది ప్రీ ప్లాన్డ్ డ్రామా కాబట్టే పట్టుకోలేదని అన్నారు. చంద్రబాబుపై వైసీపీ మూక దాడి చేస్తే రక్షణ సిబ్బంది తక్షణమే బుల్లెట్ ప్రూఫ్ షీట్స్ అడ్డుపెట్టారని గుర్తుచేశారు. ఆ ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లోనే చంద్రబాబును దూషిస్తూ ప్లకార్డులతో వైసీపీ నేతలు రోడ్లపైకి వచ్చారని అప్పటికప్పుడు ప్లకార్డులు ఎలా వచ్చాయని ఇది ముందస్తు కుట్ర కాదా అని ప్రశ్నించారు. వైసీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు సానుభూతి కోసం కోడి కత్తి డ్రామాలు ఆడించి దళిత యువకుడిని జైలు పాలు చేసారన్నారు. నేడు శవరాజకీయాలు కోసం పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయించి అవ్వాతాతల శవాలతో డ్రామాలాడారని మండిపడ్డారు. ఇప్పుడు గులకరాయి దాడితో మరోసారి సానుభూతి కోసం డ్రామాలకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

ఇటువంటి సంస్కృతి మంచిది కాదు: గన్ని

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడిపై భిన్నాభిప్రాయాలు ఉన్నా ఇటువంటి సంస్కృతి మంచిది కాదని దీనిని ఖండిస్తున్నానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు దుర్మార్గమైన చర్యలన్నారు. గతంలో చంద్రబాబుపై దాడి జరిగితే అప్పటి డీజీపీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయన్నారు. చంద్రబాబుపై ఎవరో కడుపుమండి ఈ విధంగా దాడి చేసి ఉంటారని ఆనాడు చేసిన వ్యాఖ్యలను వైసీపీ గుర్తుతెచ్చుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో కోడి కత్తి దాడి ద్వారా సానుభూతి పొందిన జగన్ ఇప్పుడు ఇలాంటి ప్రచారానికి తెర లేపుతున్నారా అనే సందేహం కలుగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఏది ఏమైనా ఇటువంటి సంస్కృతి మంచిది కాదన్నారు.



అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం

భగవద్గీతపై అష్టావధానం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 14: విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో గౌతమిఘాట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భగవద్గీత అష్టావధానం సాహితీప్రియులను అలరించింది. బల్లిపాడుకు చెందిన తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థి యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ఇప్పటివరకు 19 అవధానాలు చేసి 20వ అవధానం ఇక్కడ నిర్వహించారు. డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమానికి ధూళిపాళ మహదేవమణి సభా సంచాలకులుగా వ్యవహరించారు. అవధానం అనంతరం కవులకు, గౌతమ్‌ఘాట్ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులకు సత్కారం చేశారు. పీఠం శాఖ అధ్యక్షుడు ఎం.ఆర్.కె.రాజు, కార్యదర్శి డి.కృష్ణంరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వనపర్తి సత్యనారాయణ, శేఖర్, కలికి మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పి.వి.ఎస్.కృష్ణారావు, తోట సుబ్బారావు, సవితాల చక్రభాస్కరరావు, తరపట్ల సత్యనారాయణ సాహితీ ప్రియులు, పీఠం భక్తులు పాల్గొన్నారు.



గురువులకు సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 14: దేశీయ వారసత్వ సంపదగా నిలిచే భారతీయ సంప్రదాయ కళలను భావితరాలకు అందించే క్రమంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత అన్నారు. కలెక్టర్ విడిది కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళా దీక్షా గురువులను ఆమె సన్మానించారు. గురు శిష్య పరంపరను కొనసాగించే ప్రయత్నంలో భాగంగా కళాదీక్ష వార్షిక కార్యక్రమాన్ని పురస్కరించుకొని, హరికథ ప్రాచుర్యాన్ని భవిష్యత్తు తరాలకు అం దించటానికి నిర్వహిస్తున్న ఏడాది శిక్షణా కార్యక్రమం కలెక్టర్ ప్రారంభించారని కూచిపూడి నాట్య గురుకళారత్న డా.ఎస్.పి.భారతి తెలిపారు. రాజ మహేంద్రవరం నుంచి హరికథ గురువు శ్రీమతి పురాణం విజయలక్ష్మి, సహగురు రమాదేవి, కూచిపూడి నాట్యకారిణి డా.ఎస్.పి.భారతి సుదరన్‌లను సన్మానించారు.

లోవకు పోటెత్తిన భక్తులు

» ఆలయానికి రూ.3.54 లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, బారులు తీరిన భక్తులు

తునిరూరల్, ఏప్రిల్14: లోవదేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారు దేవస్థానం ఏర్పాటుచేసిన ఆరుబయట వంటషెడ్‌లలో, వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.3.54 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి

» విమర్శకుల నోళ్లు మూతబడ్డాయి

» మెగా అభిమానుల సమావేశంలో నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: రాష్ట్రంలో వైసీపీ పాలన అంతం కావాలంటే అన్ని శక్తులు ఏకం కావాల్సిన అవసరం ఉందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంకు, ఐ బ్యాంకు ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అభిమానులు ఇక రాజకీయాల్లోనూ చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యకిరణ్(కత్తిపూడి బాబీ) ఆధ్వర్యంలో మెగా అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. చిరంజీవి జనసేనపార్టీకి రూ.5కోట్లును ప్రోత్సాహకంగా అందించడం సంతోషకరమైన విషయమన్నారు. చిరంజీవి మద్దతు జనసేనకు లేదనే విమర్శకుల నోళ్లు ఇప్పుడు మూతబడ్డాయని, ఆయన ఆశీస్సులు ఎప్పుడు జనసేనకు ఉంటాయని నాగబాబు తెలిపారు. చిరంజీవి మద్దతుతో జనసేన బలం రెట్టింపయిందని చెప్పారు. మెగా అభిమానులంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. తన వ్యక్తిగత సంపద దాచుకోకుండా కుల, మత, ప్రాంతీయ ఆలోచనలు లేకుండా సమాజంపట్ల బాధ్యతగా ఎన్నో ప్రజోపయోగకరమైన సేవలు చేయడమేకాక, పలువురికి అండగా నిలుస్తున్న పవన్‌కల్యాణ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనసేన స్టార్ క్యాంపయినర్ సాగర్(ఆర్‌కే నాయుడు) తెలిపారు. ఒక వ్యక్తిగా ఇంత చేసిన పవన్ వ్యవస్థకు ప్రతినిధిగా ఉంటే ఎంత చేయగలరో ఆలోచించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు పి.భవానీకుమార్, ఏడిద శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, కృష్ణప్రసాద్, రవికుమార్, చంద్రశేఖరరెడ్డి, భైరు వెంకన్నగౌడ్, రమేష్‌నాయుడు, కోపల్లి శ్రీనివాస్, జి.కొండలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



సందర్శకులతో కిక్కిరిసిన సాగరతీరం

బీచ్‌లో సందర్శకుల సందడి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 14: కాకినాడరూరల్ సూర్యారావుపేట సాగర తీరం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం సెలవు దినం కావడం, వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వేసవి తాపం నుంచి సేదతీరేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున సందర్శకులు, చిన్నారులతో కుటుంబ సభ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సముద్రంలో జలకాలాటలు ఆడుతూ యువత, పెద్దలు ఎంజాయ్ చేశారు. చిన్నారులు సముద్ర తీరంలో సముద్ర ఇసుకలో ఆటపాటలాడుతూ, కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తీరంలో గస్తీ నిర్వహించారు.

శ్రీ ప్రకాష్‌లో జీవన తరంగిణి పుస్తకావిష్కరణ



తరంగిణి పుస్కకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

తునిరూరల్, ఏప్రిల్ 14: బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పశుపోషక శాస్త్ర విజ్ఞాన కవి డాక్టర్ యెలినేని రాఘవరావు జీవన తరంగిణి పుస్తకావిష్కరణ, సన్మాన వేడుక ఆదివారం అట్టహాసంగా జరిగింది. శ్రీ ప్రకాష్ విద్యాసౌధంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రిటైర్డ్ డాక్టర్ మన్మోహన్ సింగ్, గౌరవఅతిథులుగా విచ్చేసిన ఇక్రిశాట్ సీనియర్ సైంటిస్ట్(రిటైర్డ్)డాక్టర్ రవిందర్ రెడ్డి, పశు సంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం రాఘవరావు సేవలను కొనియాడారు. పశు పోషకులను సమాజంలో గౌరవంగా నిలబెట్టేందుకు రాఘవరావు చేసిన కృషి అమోఘమని స్ఫూర్తిదాయకమైన జీవనానికి చిరునామా డాక్టర్ రాఘవరావు అని పేర్కొన్నారు. రాఘవరావు అందించిన సేవలు, పరిశోధనలు ఎంతోమంది పాడి రైతుల తరుపున ఆయనకు కృతజ్ఞతగా ఆయన జీవన గమనంపై ఒక పుస్తక రూపకల్పన చేయాలనే ఆలోచనకు ప్రతి రూపమే ఈ జీవన తరంగిణి అని తెలిపారు. బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ వీకే నరసింహారావు మాట్లాడుతూ కృషితో నాస్తి దుర్భిక్ష్యం అనే నానుడి రుజువు పరిచేటట్లుగా ఆయా రంగాల్లో నీతి నిజాయితీలతో పనిచేసిన వ్యక్తులను సత్కరించుకోవడం పరిపాటి అని అన్నారు. తాను ఎన్నుకున్న తన కోసం కాకుండా పాడి రైతుల కోసం పాటుపడే డాక్టర్ రాఘవరావు అందించిన సేవలు అభినందనీయమని పాడి రైతుల తరుపున ఆయనకు కృతజ్ఞతగా ఒక పుస్తకం రూపకల్పన చేయాలనే ఆలోచనకు కార్యరూపం దాల్చి జీవన తరంగిణి అనే పుస్కకావిష్కరణ కార్యక్రమం నేడు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాబార్డు రిటైర్డ్ సీజీఎం పి.మోహనయ్య, డాక్టర్ కె. నరేంద్రబాబు, పంజ్‌బదానా, డాక్టర్ వి. రవీంద్రబాబు, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, డాక్టర్ సింహాచలం, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్లు, మెంబర్లు, గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.



అల్లవరం: గూడాలలో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ఇళ్లు

గూడాలలో అగ్ని ప్రమాదం

» మూడు తాటాకిళ్లు దగ్ధం » రూ.9లక్షల ఆస్తి నష్టం

» నిరాశ్రయులైన నాలుగు కుటుంబాలు

అల్లవరం, ఏప్రిల్ 14: వారి ఆశలు కళ్లెదుటే కాలి బూడిదయ్యాయి. అర్ధరాత్రి ఎగసిపడ్డ మంటలకు భయపడి పిల్లాపాపలతో పరుగులు తీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గూడాల పల్లయ్యచెరువు గట్టు వద్ద శనివారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆకుల వెంకట్రావు, ఆకుల సత్యనారాయణ, ఆకుల మంగతాయారు నివసిస్తున్న తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు కుటుంబాల వారు కట్టుబట్టలతో బయటపడ్డారు. అదే ఇంట్లో ఉంటున్న దొడ్డా సత్యవతి నిరాశ్రయురాలైంది. వెంకట్రావు ఇంట్లో టీ కాచేందుకు గ్యాస్ వెలిగించగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరిగిందని చెబుతున్నారు. 8వ తరగతి చదువుతున్న బాలిక గమనించి అందరి ప్రాణాలు కాపాడింది. అమలాపురం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి చివరి క్షణంలో మంటలను ఆర్పివేసింది. గంధం పల్లంరాజు, పోలిశెట్టి నాయుడు బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.30వేలు సాయం అందజేశారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఆర్.నానిరాజు, కొనుకు బాపూజీ, దాకారపు చిరంజీవి బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5వేలు వంతున ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. టీడీపీ నేతలు అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, దెందుకూరి సత్తి బాబురాజు, పంపిరెడ్డి కాశీ బాధితులకు రూ.22వేలు అందజేశారు. పోలిశెట్టి భాస్కరరావు, తాటికాయల సుధీర్, రాసూరి రాంబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

స్మార్ట్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖ

» సెల్‌ఫోన్ షాపు యజమాని వినూత్నంగా పెళ్లి కి ఆహ్వానం



సెల్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖను త యారు చేసిన దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 14: వినూత్న ఆలోచనలతో ఎవరి అభిరుచికి తగినట్లు వారు శుభలేఖలు తయారు చేయించుకుంటున్న కల్చర్ ఈ మధ్య ఎక్కువైంది. కాలానుగుణంగా శుభలేఖల ముద్రణలో కొత్త ఒరవడి ఎప్పటికప్పుడు నడుస్తోంది. దీనిలో భాగంగా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంనకు చెందిన మొబైల్ షాపు రిపేర్ యజమాని గ్రంధి మణికంఠ వినూత్న ఆలోచనలతో తన పెళ్లి శుభలేఖను తానురోజు రిపేరుచేసే సెల్‌ఫోన్ మాదిరిగా పరిణయ శుభలేఖను తయారు చేయించుకున్నాడు. ముందుభాగంలో వధూవరుల ఫొటోలు, మధ్యలో పెళ్లికి సంబంధించిన వివరాలు, చాటింగ్ మాదిరిగా మెజేస్ రూపంలో పెట్టి, వెనుక భాగంలో క్యూఆర్‌కోడ్‌ను ముద్రించి సుమారు 1000 శుభలేఖలను ముద్రించారు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే పెళ్లి వివరాలు అన్నీ సెల్‌ఫోన్ శుభలేఖలో కనిపిస్తాయి. గ్రంధి రామ్మోహనరావు, సత్యభామ దంపతుల ద్వితీయ కుమారుడు గ్రంధి మణికంఠ, మాధురిల వివాహం ఈనెల 18వ తేదీన భీమవరంలో జరుగుతుందని ముద్రించిన శుభలేఖలను కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు అందించి పెళ్లికి రావాలంటూ ఆహ్వానం పలుకుతున్నాడు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు చెరుకూరివీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.



ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

బిక్కవోలులో వివాహిత ఆత్మహత్య



బిక్కవోలులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన చిన్ని

అనపర్తి, ఏప్రిల్ 14: వివాహం జరిగి ఏడాది కాకుండానే ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బిక్కవోలులో జరిగింది. ఎస్‌ఐ బుజ్జిబాబు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన మద్ది చిన్ని(24)కి, రాజవొమ్మంగి మండలం ఒట్టిగడ్డకు చెందిన ఆవుగడ్డ ప్రసాద్‌తో గత ఏడా ది జూన్‌లో వివాహం జరిగింది. ప్రసాద్ బిక్కవోలు మండలం బలభద్ర పురం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుం డగా చిన్ని బిక్కవోలులో వలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల రాజీనామా చేసింది. శనివా రం రాత్రి భార్యాభర్తలు చెరో గదిలో నిద్రపోయారు. అయితే ఆదివారం ఉదయం చిన్ని గది నుంచి బయటకు రాకపోవడం, తలుపులు లోపలికి గడియవేసి ఉండడంతో ప్రసాద్ ఇంటి యజమానుల సహా యంతో త లుపులు పగులగొట్టి చూడగా ఆమె ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో ప్రసాద్ పోలీసులకు సమాచారం అందించాడు. అలాగే చిన్ని తల్లిదండ్రు లకు సమాచారం అందించడంతో వారు బిక్కవోలు చేరుకుని కుమార్తె మృతదేహం వద్ద విలపించారు. అయితే భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారని ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో అర్థం కావడం లేదని చిన్ని తండ్రి మద్దు వెంకటరమణ రోదిస్తున్నాడు. మృతురాలి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన మేరి(30)కి, చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి డేవిడ్‌రాజుకు 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త డేవిడ్‌రాజు కుటుంబాన్ని సరిగా పట్టించుకోకపోవడంతో మేరీయే పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించేది. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో శనివారం రాత్రి ఇంటిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మేరీ మృతిపై తండ్రి కాపు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన వాసంశెట్టి లోవరాజు

కరప, ఏప్రిల్ 14: కాకినాడజిల్లా కరప శ్మశానవాటిక సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన వాసంశెట్టి లోవరాజు(35) కాకినాడ పోర్టులో మూటల పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని మోటర్‌సైకిల్‌పై కాకినాడ నుంచి వలసపాకల బయలుదేరాడు. కరప శ్మశానవాటిక సమీపంలోకి వచ్చేసరికి రామచంద్రపురం నుంచి కాకినాడ వెళుతున్న లారీ వేగంగా వచ్చి లోవరాజును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోవరాజును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



దున్నా రవీంద్రనాధ్ రాగూర్

నల్లజర్ల, ఏప్రిల్ 14: నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన దున్నా రవీంద్రనాథ్ రాగూర్(24)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాగూర్ ఆదివారం పొలం పనులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వస్తుండగా బైపాస్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 14: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల సమాచారం మేరకు మండలంలో కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్ళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో మర్రిపీడు, తిమ్మాపురం గ్రామానికి చెందిన శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం ఉప్పలపాడు నుంచి తాళ్ళూరు జాతీయ రహదారి ఎక్కుతుండగా వైజాగ్ నుంచి రాజమండ్రి వెళ్లే కారు ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అలాగే పెద్దాపురం గ్రామానికి చెందిన నవుడు కిశోర్, జెడ్ రాగంపేట సర్వీసురోడ్డులో రాంగ్‌రూట్‌లో జగ్గంపేట వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో అతనికి బలమైన గాయాలయ్యాయని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామేశంపేటలో రూ.1.18 లక్షలు పట్టివేత



రంగంపేట: రామేశంపేట చెక్‌పోస్ట్ దగ్గర కారును తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

రంగంపేట, ఏప్రిల్ 14: తూర్పుగోదావరిజిల్లా రంగంపేట మండలం రామేశంపేట చెక్‌పోస్ట్ వద్ద ఎటువంటి అధికార పత్రాలు లేని రూ.1.18 లక్షలు సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్, మండల మేజిస్ట్రేట్ పి.వెంకటరత్నం ఆదివారం తెలిపారు. కోనాల హశ్వంత్‌రెడ్డి యానాం నుంచి రాజమహేంద్రవరానికి కారులో వెళ్తుండగా రామేశంపేట చెక్‌పోస్ట్‌వద్ద నిర్వహించిన తనిఖీలో ఈ సొమ్మును గుర్తించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌టీ కానిస్టేబుల్ జీవీ ఎస్‌ఎస్ రెడ్డి, చెక్‌పోస్ట్ కానిస్టేబుల్స్ కె.ఆదినారాయణ, జి.వెంకటలక్ష్మి, రంగంపేట ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



తాళ్లరేవు: పి.మల్లవరం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కమిషనర్

పి.మల్లవరం సెబ్ చెక్‌పోస్టు పరిశీలన

తాళ్లరేవు, ఏప్రిల్ 14: పి.మల్లవరం, సుంకరపాలెం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సెబ్ చెక్‌పోస్టును ఆదివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి తనిఖీ చేశారు. యానాం-కాకినాడ రూట్‌లో వాహనాలను పరిశీలించారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద చేసే తనిఖీ విధులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు టి.సత్యనారాయణ, ఏ.ఎస్. దొర, సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.రామశేషయ్య పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు నీటి విడుదల నిలిపివేత

ఏపీ జెన్కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్



డొంకరాయి జలాశయం వద్ద గేట్లు కిందకు దింపుతున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

మోతుగూడెం, ఏప్రిల్ 14: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జలాశయం నుంచి గోదావరిడెల్టా రబీ పంటలకు శనివారం సాయంత్రం నుంచి నీటి విడుదలను నిలిపివేశామని ఏపీ జెన్కో డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.విజయ్‌కుమార్ తెలిపారు. సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు గోదావరి డెల్టాకు నీరు చేరుతుందని, అయితే పొల్లూరులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేస్తేనే 3500నుంచి 4వేలు క్యూసెక్కుల వరకు నీరు చేరుతుందని రబీలో మార్చి ఏప్రిల్‌లో అధికంగా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు 7వేల క్యూసెక్కులు అవసరమని విన్నవించడంతో శనివారం సాయంత్రం వరకు డొంకరాయి జలాశయం ద్వారా నేరుగా (విద్యుత్ ఉత్పత్తి లేకుండా)3500 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. విద్యుత్ ఉత్పత్తి లేకుండా ఇప్పటివరకు గోదావరి డెల్టాకు 4248 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో 5నుంచి 6 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన వివరించారు. గోదావరి డెల్టాలోని రబీ పంటలకు సీలేరు నుంచి నీటి విడుదల నిలిపివేశారు. ఈనెల ఒకటినుంచి గోదావరి డెల్టాకు డొంకరాయిజలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈనెల ఒకటి నుంచి 13వ తేదీ వరకు 4,28 టీఎంసీల నీటిని విడుదల చేశారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆధ్వర్యంలో గేట్లు కిందకి దింపించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో లోయర్ సీనియర్ ప్లాంట్‌మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

రాజుపేట గ్రామంలో

ఎమ్మెల్యే ధనలక్ష్మికి నిరసన సెగ



రాజవొమ్మంగి : బరదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామంలో ఎమ్మెల్యే ధనలక్ష్మిని నిలదీస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 14: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి నిరసన సెగ ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి 9.30కు బరదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి వెళ్లగా గ్రామస్థులు గ్రామంలో ఉన్న పలు సమస్యలపై నిలదీశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజుపేట గ్రామానికి రహదారి సౌకర్యం లేదని, పాఠశాల శిథిలావస్థలో ఉందని ఎన్నిసార్లు అధికారులకు పాలకులకు చెప్పినా పట్టించుకోవట్లేదని పిల్లలు చనిపోతే ఎవ రు బాధ్యులని గ్రామస్థులు ప్రశ్నించారు. గ్రామంలో తాగునీటి సమస్య వెంటాడుతుందని, గ్రామానికి వెళ్లే దారిలో వైసీపీ నాయకులు నాణ్యతలేని కాజ్వే నిర్మించారన్నారు. గ్రామంలో చాలామందికి కుల ధ్రువీకరణ పత్రాలు లేవని తెలిపారు. స్థానిక వైసీపీ నేతలుకలుగజేసుకొని ఆపేందుకు ప్రయత్నం చేశారు.

వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని

తుడిచేసే సమయం వచ్చింది

» జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను పట్టి పీడిస్తున్న వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని తుడిచి వేసే సమయం వచ్చిందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో క్లీన్ పిఠాపురం-గ్రీన్ పిఠాపురం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పురవీధులను చీపుర్లతో శుభ్రపరిచారు. చెత్త మాదిరిగానే వైసీపీని రాష్ట్రం నుంచి శుభ్రం చేయడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య విధానాలతో అన్నివర్గాలకు న్యాయం చేస్తామని తెలిపారు. అంబేడ్కర్ జయంతి రోజున ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్లీన్ పిఠాపురం-గ్రీన్ పిఠాపురం కార్యక్రమంలో రోడ్లు ఊడుస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

ఏజెన్సీ సమాచారం



చింతూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న జమాల్‌ఖాన్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

● ఘనంగా అంబేడ్కర్ జయంతి

మోతుగూడెం, ఏప్రిల్ 14: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, మోతుగూడెం ఎస్‌ఐ జి.గోపాలరావు అన్నారు. చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం జగదాంబ సెంటర్లో పోలీస్‌స్టేషన్ దగ్గర ఉన్న డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం డీఏవీ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల 8,9 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం నిరుపేదలు 30 మంది మహిళలకు చీరలు, పండ్లు, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, చాక్లెట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహం, డీఏవీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రఘురాం, జెన్‌కో ఉద్యోగస్తులు, ఉపేంద్ర, ధారబాబు, సురేష్‌కుమార్, శ్రీనివాస్, పీటీ రామారావు, శైలజ , జెన్కో ఎంప్లాయిస్, ఏపీ ఎస్ సీబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని రేఖపల్లిలోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాదిరెడ్డి సత్తిబాబు, వాళ్ళ రంగారెండి, ముత్యాల రామారావు, సవలం రాజు, మాచర్ల గంగులు, ముత్యాల శ్రీను, చిక్కాల బాలు, అంబేడ్కర్ కాలని యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చింతూరు: చింతూరులో జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చింతూరు సెంటరులో లాడె శ్రీనివాసరావు నేతృత్వంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి పలువురు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భాస్కర్ పాఠశాల డైరక్టర్ వేణుగోపాల్, సాంఘిక సంక్షేమ వసతి గృహ వార్డెన్ తాతాజి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, దేశానికి దిశా నిర్దేశం చేసిన దార్శనికుడు డాక్టర్ అంబేడ్కర్ అని కిలారు వెంకటేశ్వరరావు, నలజాల శ్రీకాంత్‌చౌదరి అన్నారు. ఆదివారం నెల్లిపాక, లింగాలపల్లి, ఎటపాక, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జి రాము, సంద్ర శ్రీను, చింతా గంగరాజు, నూకల దివ్య, చింతా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఆశయాల కోసం యువత పోరాడాలి'



రంపచోడవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కూటమి ప్రతినిధి శిరీషాదేవి

రంపచోడవరం: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్క ర్ ఆశయ సాధన కోసం యువత పోరాడాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందే ందుకు ఇంకా ఎన్నో అవాంతరాలను గిరిజనులు ఎదుర్కొంటున్నారని రంప చోడవరం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి అన్నారు. ఆదివారం రంపచోడవరంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్‌విగ్రహానికి కూటమి నాయకులతో నివాళులర్పించారు.

● రంపచోడవరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. రంపచోడ వరం సర్పంచ్ మంగా బొజ్జయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు. రంపచోడవరం ఐటీడీఏలో కూడా అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసు, పరిపాలనాధికారి డీఎన్‌వీ రమణ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేవీపట్నం: మండలంలో ఫజుల్లాబాద్, ఇందుకూరు తదితర గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పత్తి సుబ్బారావు, ఎన్.రాజబాబు, ఎన్. రాఘవ, బి.సోమరాజు పాల్గొన్నారు.

వై.రామవరం: వై.రామవరంలో పలువురు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకటరమణారెడ్డి, స్థానిక ఆస్పత్రి వైద్యులు చైతన్య, ఉపాధ్యాయులు లండా రాజబాబు, పల్లాల లక్ష్మణరెడ్డి, గొర్లె సత్యనారాయణ, భగవాన్‌మూర్తి, రిటైర్డు ఉద్యోగులు కుటుంబరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

నాడు కోడికత్తి డ్రామా.. నేడు గులకరాళ్ల నాటకం

● రంపచోడవరం ఉమ్మడి అభ్యర్థి మిరియాల శిరీష దేవి

రాజవొమ్మంగి, ఏప్రిల్ 14: గత ఎన్నికలకు ముందు కోడి కత్తి డ్రామా, తన సొంత బాబాయి వివేకానంద రెడ్డి హత్యలను జగన్మోహన్ రెడ్డి చేయించి ఎన్నికలకు వెళ్లిన జగన్ నేడు గులకరాళ్ల నాటకంతో ఎన్నికలకు వెళుతున్నారని రంప చోడవరం టీడీపీ బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిని మిరియాల శిరీష దేవి అన్నారు. ఆదివారం ఆమె రాజవొమ్మంగి జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేకపోవడం ఏంటని, ముఖ్యమంత్రి పర్యటన జరుగుతుంటే విద్యుత్‌శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. దాడి జరుగుతుంటే డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీపీలు ఏం చేస్తున్నారు. ఘటన జరిగిన కొద్ది నిమిషాలకే దాడిని ఖండిస్తూ టీడీపీకి వ్యతిరేకంగా ఫ్లకార్డులు ఏలా వచ్చాయని ఆమె అడుగుతూ ఇదంతా పక్కా ప్రాణాళికతో సానుభూతి కోసం వైసీపీ ఆడిన నాటకమన్నారు. వైసీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి 10వ తేదీన సామాజిక మాధ్యమంలో మరో నాలుగురోజుల్లో ఎవరి ఊహకి అందని సంఘటనలు జరగనున్నాయని, ఎన్నికలు మలుపు తిరగనున్నాయని పోస్టు పెట్టారని ఆ నాయకుడు పెట్టినట్టుగానే గులకరాళ్లతో శనివారం దాడి జరిగిందన్నారు. విద్యుత్ లేని సమయంలో ప్రచార వాహనం పైకి ఎక్కేందుకు ఎలా అనుమతిస్తారని అన్నారు. టీడీపీ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ముప్పన కేశవ్,వాశంశెట్టి గంగాధర్, కేశిరెడ్డి శివ,వజ్రపు అప్పారావు తదితర నాయకులు ఉన్నారు.

రంప చేరుకున్న ఎన్నికల సామగ్రి

● రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో భద్రపర్చిన రిటర్నింగ్ అధికారి

రంపచోడవరం, ఏప్రిల్ 14: సాధారణ ఎన్నికల కోసం రంప చోడవరం నియోజకవర్గానికి సంబం ధించి పార్లమెంటు, అసెంబ్లీ విభా గాలకు అవసరమైన ఎన్నికల సా మగ్రిని ఆదివారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమ క్షంలో రిటర్నింగ్ అధికారి ప్రశాంత కుమార్, ఏఎస్పీ జగదీష్‌లు రంపచో డవరంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరి చారు. పాడేరు నుంచి ఈ సామగ్రి మొత్తం రెండు కంటైనర్లలో రంపచోడవరం వచ్చింది. ఇక్కడ ఉన్న 399 పోలింగ్ కేంద్రాల కోసం అవసరమైన ఈవీఎంలు, వివి ప్యాడ్లు, ఇతర సామగ్రిని ఈ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. మొత్తంగా పార్లమెంటు, అసెంబ్లీకి సంబంధించి 518 ఈవీఎంలు, 518 వివిప్యాడ్లు, 518 కంట్రోల్ యూనిట్లు వచ్చాయి. అనునిత్యం పూర్తి భద్రత మధ్య వీటిని భద్రపర్చుతున్నామని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

మహోన్నతుడు అంబేడ్కర్

▸ నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి పద్మరాజు
▸ ఘనంగా బాబాసాహెబ్ జయంతి
▸ పలువురు నాయకులు, అధికారుల నివాళి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు నాయకులు, అధికారులు నివాళులర్పించారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ ఉద్యోగులు సంఘం నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థులు ఆదిరెడ్డి శ్రీనివాస్, మార్గాని భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాళ్లూరి విజయకుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, మహిళా నాయకులు రేలంగి శ్రీదేవి, హారిక, తురకల నిర్మల, ఖండవల్లి లక్ష్మి, మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ షేక్ మద్రాస్ ఆలీ, ఆర్ఐ శ్రీనివాస్, స్టేట్ బ్యాంక్ ఆఫీసర్ నారాయణ, బీఎస్పీ నాయకుడు పట్నాల విజయకుమార్, ఎక్సైజ్ శాఖ, ఇన్‌కంట్యాక్స్, సెంట్రల్ జైలు, ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘాల నాయకులు నివాళులర్పించారు. మల్లికార్జున నగర్‌లో సమత యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాశి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలోను, ఆనంద్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ కొయ్యల రమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు జరిగాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి కమిషనర్ దినేష్‌కుమార్ నివాళులర్పించారు. తిలక్ రోడ్డులోని బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సంఘం కార్యాలయంలో సంఘం వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కేకే సంజీవరావు, మేడిశెట్టి తాతబ్బాయి, వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాదరావు, నాయకులు కోనాల లాజర్, నక్కా రవీంద్రనాథ్‌లతో కలిసి నివాళులర్పించారు. కంబాలచెరువు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఆఫీసర్స్ అసోసియేషన్, స్టాఫ్ యూనియన్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడేపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. గణేష్ నగరంలో ముళ్ళ మాధవ్ ఆధ్వర్యంలోను, 49వ డివిజన్‌లో మాసా రామ్ జోగ్ ఆధ్వర్యంలోను అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి, ఏపీఆర్ఐఈసీఎస్సీఎస్టీ చైర్మన్ కోలమూరి ప్రభాకరరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆరీఫ్ హాజరై నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థులు బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక సుబ్బారావునగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి రాజమహేంద్రి విద్యాసంస్థల అధినేత టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు, చిన్నపిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అలాగే ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాల సముదాయంలోని అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. వసతిగృహ సంక్షేమాధికారులు ముత్యాల సుబ్బారావు, పి.శ్రీను, కె.సుందరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ జి.శరత్‌బాబు, తెలుగుశాఖ అధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడారు. సీరా గంగాధరరావు, పీఏ కిశోర్‌బాబు, అధ్యాపకేతర సిబ్బంది ప్రవీణ్‌కుమార్, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కడియంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్: నగరంలోని 15వ వార్డులోని తాడితోట బైపాస్ రోడ్డు ఇందిరానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గుత్తుల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ మార్గాని భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఇతర నాయకులు విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తుల రమణ ఆధ్వర్యంలో 200మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.వినూత్న, పలువురు వైసీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, పాల్గొన్నారు. శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ అంబేడ్కర్ దళితుల సామాజిక రాజకీయ హక్కులు, దేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషి చేశారన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండంలోని కోలమూరులో తుమ్మల తాతారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిగింది. భారీ స్థాయిలో భోజనాలు ఏర్పాటు చేశారు. బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో సూపరింటిండెంట్ ఇంజనీర్ ఎ.గురుబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సమాజ అభివృద్ధికి అంబేడ్కర్ ఆలోచన, మేధాశక్తితో రాజ్యాంగాన్ని రూపొందించారని, ప్రతిఒక్కరూ ఆయన ఆశయసాధనకు కృషిచేయాలని గురుబాబు అన్నారు. కార్యక్రమంలో డీఈలు కె.విజమ్‌కుమార్, పొన్నమాల రవి, ఏడీఈలు శావరామకృష్ణ, జగతా అచ్యుతరామయ్య, అశోక్, కేవీ రమణ, కె.నవీన్, శ్రీనివాస్, బందులరాజు తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండ: జంబుపట్నంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కడియం: కడియంలో జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో న్యాయవాది తోరాటి వసంతరావు, దామిశెట్టి నాగరాజు, సంజీవ్, పల్లేటి పవన్, అడబాల ప్రభాకర్ పాల్గొన్నారు. పొట్టిలంకలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొజ్జా తారకం-రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్నరాజు, నక్కా చంటిబాబు, బడుగు సత్తిబాబు, సోడాబత్తుల చంటి, రేముళ్ళ ఏసు పాల్గొన్నారు. కడియపులంక, దుళ్లలో గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, పాటంశెట్టి రాంజీ, తోకల శ్రీనివాసరావు, కట్టుంగ నాగరాజు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



నన్నయ వర్శిటీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ

దివాన్‌చెరువు: రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం, పాత తుంగపాడు, కొత్తతుంగపాడు, జి.యర్రంపాలెం, కొండగుంటూరు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండగుంటూరులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: అంబేడ్కర్ జయంతిని మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ర్యాలీలు నిర్వహించారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరులో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పసల గగారిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశంలోని అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారికత కోసం తన జీవితం చివరి వరకూ పోరాటం చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో పోతుల చెల్లయ్య, దూళ్ళ నాగేశ్వరరావు, పసల వజ్రరావు, కొందుపురి శీనుహరిరాజు, సోమరాజు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రంగంపేట, సుభద్రంపేట, దొడ్డిగుంట, మర్రిపూడి, ఎస్టీ రాజాపురం, చంద్రేడు, పెదరాయవరం, దొంతమూరు, నల్లమిల్లిలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.

గోకవరం: మండలంలోని గోకవరం, తిరుమలాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాస్, ఎస్‌ఐ కె.నాగరాజు పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ సేవలను కొనియాడడంతోబాటు, ప్రతిఒక్కరూ ఆయన అడుగజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కాగా అంబేడ్కర్ జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించడంతోపాటు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

రాజానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూర్యారావుపేట ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు ఆధ్యక్షతన అంబే డ్కర్ జయంతిని నిర్వహించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని చక్రద్వార బంధం, నందరాడ, నరేంద్రపురం, కలవచర్ల, కానవరం, సీతారాంపురం, ఫరిజెల్లిపేట, పల్లకడియం, వెలుగుబంధ, రాధేయపాలెం, తోకాడ, ముక్కినాడ, మల్లంపూడి తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున బాణా సంచాలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.

అనపర్తి: అనపర్తిలోని కెనాల్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, కొత్తపేట, పాత హరిజన పేట, రామవరం గ్రామంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు నల్లా చిన్నారావు ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్ పాల్గొన్నారు. అలాగే అనపర్తి ఏరియా ఆసుపత్రిలో అంబేడ్కర్ చిత్రపటానికి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోరుకొండ: మండలంలోని జంబుపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి డీఎస్పీ కె.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి సౌకర్యాలు లేని సమాజంలో అంబేడ్కర్ ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదిగిన మహానేత అని కొనియాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, షెటిల్, బ్యాట్మింటన్, కారమ్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, చల్లారావు, ఈతకోట్టు చినబాబు, నాంబత్తుల రాంబాబు, ఈతకుర్తి గిరిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ అన్నవరం, కర్రి చిన్నయ్య, నాంబత్తుల ప్రభాకర్, ఈతకొట్టు ఎజ్రా పాల్గొన్నారు.

వినయ్ సుంకర జయంతి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 14: డాక్టర్ వినయ్ సుంకర జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం హెల్త్‌సెంటర్‌లోని వినయ్ విగ్రహానికి ఆదివారం వీసీ కె.పద్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ వినయ్ సుంకర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఫౌండేషన్ ఛైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దివాన్‌చెరువులోని సుంకర వెంకట్రావునగర్‌లో జరిగిన వినయ్ జయంతి వేడుకల్లో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

'నన్నయ' ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 14: ప్రపంచంలోని అన్ని దేశాల్లో కొనియాడబడుతున్న మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత పయనించాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని కేంద్ర గ్రంథాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి వీసీ పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడుగా ఎదిగి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే అంబేడ్కర్ నినాదంలోని అర్థాలను వివరించారు. వివిధ జాతులు, మతాలు ఉన్న భారతదేశానికి అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ నన్నయ వర్శిటీ రాజమహేంద్రవరం, కాకినాడ క్యాంపస్‌లలో అంబేడ్కర్ విగ్రహాలున్నాయని, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఏర్పాటుకు వీసీ ఆమోదించారన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

సీతానగరం, ఏప్రిల్ 14: కాంగ్రెస్ పార్టీకి త్వరలోనే పూర్వవైభవం వస్తుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం సీతానగరంలోని శివాలయంలో జరిగిన బ్రాహ్మణ సంఘంతో ఆత్మీయ సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. వైసీపీలో ఉన్న నాయకులందరూ కాంగ్రెస్ వాదులేనని, ప్రస్తుతం వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు ప్రారంభమయ్యాయన్నారు. ఒక్క చాన్స్ అంటూ తిరిగితే ప్రజలు వైసీపీకి అవకాశం ఇచ్చారని, దానిని ఆ పార్టీ దుర్వినియోగం చేసుకుందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందన్నారు. మళ్లీ ప్రజలు ఆ పార్టీకి పట్టంగట్టే అవకాశం లేదని రుద్రరాజు అన్నారు. ఆయనకు బ్రాహ్మణ సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థి ముండ్రు వెంకట శ్రీనివాస్ పెదబాబు, అయిల శ్రీనివాస్, దుళ్ళ సూర్యనారాయణ, గుండుబోగుల శ్రీనివాసరావు, పిర్ల వెంకటేశులు, యల్లమంద రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

▸ శాటిలైట్‌సిటీ బైక్ ర్యాలీలో గోరంట్ల, దగ్గుబాటి హితేష్



రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 14: తెలుగుదేశం పార్టీ ఎపుడూ పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం మండలంలోని శాటిలైట్‌సిటీలో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో మార్ని వాసుదేవరావు పర్యవేక్షణలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధ్యక్షతన ఎన్టీఆర్ విగ్రహం నుంచి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు హితేష్, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు అన్యాయం చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి విజయం సాధించేందుకు అన్నివర్గాల ప్రజలు కృషి చేయాలన్నారు. అసెంబ్లీ స్థానానికి సైకిల్‌గుర్తుపైనా, పార్లమెంట్ స్థానానికి కమలం గుర్తుపై ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, దారా అన్నవరం, ఆకుల శ్రీదర్, బీరా ప్రకాష్, నాగేంద్ర, మన్యం శ్రీను, పిన్నింటి ఏకబాబు, ఆళ్ళ ఆనందరావు, బొప్పన నాగేశ్వరరావు, పెండ్యాల రామకృష్ణ, కామిని బాస్కరరావు, మట్టా శ్రీనువాసు, బాబూ ఖాన్, సావాడ శ్రీనివాసరెడ్డి, తలారి మూర్తి, రామలక్ష్మి, బండారు సత్తిబాబు, పెంకే కోటేశ్వరావు, సరోజిని, కరణం రామారావు, కూరాడ వెంకటేష్, ఎంఎస్ఆర్ శ్రీను, బత్తుల శివశంకరయాదవ్, శీలం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గండిపోశమ్మ ఉత్సవాలు

దేవీపట్నం, ఏప్రిల్ 14: మండల పరిధిలో ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గురువారం నుంచి ఐదు రోజులపాటు ఆలయ అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా 30వేల మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. టిక్కెట్ తదితర ఆదాయాల ద్వారా రూ.56వేలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పాపికొండలకు తరలిన నాలుగు బోట్లు

ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆదివారం నాలుగు బోట్లలో సుమారు 250 మంది పర్యాటకులు పాపికొండలకు వెళ్లారు. పోశమ్మగండి బోట్ పాయింట్ నుంచి ముంపు గ్రామాలైన దేవీపట్నం, పూడిపల్లి, గొందూరు, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లారు.

మాధవరాయుడుపాలెంలో కాశీవిశ్వేశ్వరుని కళ్యాణం

కడియం, ఏప్రిల్ 14: మాధవరాయుడుపాలెంలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర శివపంచాయతన దివ్యక్షేత్రంలో ఆదివారం శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది.సర్పంచ్ అన్నందేవుల చంటి, విజయ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వైసీపీ నుంచి చేరికలు శుభ పరిణామం

▸ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ▸ టీడీపీలోకి భారీగా చేరికలు ▸ ఇదే కూటమి విజయానికి సూచిక: నేతలు



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాయకులు, కార్యకర్తలతో ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా కార్యకర్తలు, నాయకులు చేరడం శుభపరిణామం అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, బీజేపీ నేత దగ్గుబాటి హితేష్ చెంచురామ్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం 30వ డివిజన్‌లో మందపల్లి అవినాష్, పలివెల అనిల్, ఆర్.దేవేంద్ర, డి.పవన్‌కుమార్, ఏ.చంద్రమౌళి, ఏ.నవీన్ కుమార్, ఎం.ప్రశాంత్, ఎం.జీవన్ సాగర్, జగన్ మనీష్, రిద్విక్, క్రాంతి తదితరులు ఇలా సుమారు 200 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు, హితేష్, అనుశ్రీ వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. వైసీపీ ఇంటికి వెళ్లిపోవడం ఖాయమన్నారు. వైసీపీ నిరంకుశ పాలన, ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకత్వం విధానాలు నచ్చక ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. ఇటీవల కాలంలో నగరంలో పలు డివిజన్ల నుంచి వేలాది మంది తెలుగుదేశం పార్టీలో చేరారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ పన్నులు, చెత్త పన్ను, విద్యుత్ బిల్లులు పెంపు తదితర మార్గాల్లో ప్రజల జేబులకు చిల్లు పెడితే ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరాభివృద్ధి పేరిట వేసిన రంగులు, అంటించిన రాళ్లకు ప్రజాధనం దుర్వినియోగం చేసారని మండిపడ్డారు. అభివృద్ధికి సుందరీకరణకు తేడా తెలియకుండా చేసిన పనుల వల్ల ప్రజాధనం బూడిదలో వేసిన పన్నీరయ్యిందన్నారు. తమ కూటమి అధికారంలోకి వస్తే అసలు అభివృద్ధి అంటే ఏమిటో ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. తమ సూపర్ సిక్స్ మేనిఫెస్టోకు ప్రజల్లో మంచి ఆదరణ వచ్చిందని అలాగే ఇటీవల తాము ఐదు అంశాలతో విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎరకా కొండ, అక్కల కోటేశ్వరరావు, రుద్ర, క్షత్రియ బాల సుబ్రహ్మణ్యం సింగ్, రామకృష్ణ, సుబ్బారావు, నాగేశ్వరరావు, లలిత్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

● అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ ఉద్యోగులు సంఘం నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పూలమాలలతో నివాళులర్పించారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిరెడ్డి వాసు

టీడీపీలోకి కాపు సంఘం నేత ఆకుల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: రాజమహేంద్రవరానికి చెందిన కాపు సంఘం నాయకులు ఆకుల షణ్ముఖరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆదివారం షణ్ముఖరావును తీసుకుని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు నేరుగా పాయకరావు పేట బహిరంగ సభకు వెళ్లారు. అక్కడ పార్టీ అధినేత చంద్రబాబుకు ఆకులను పరిచయం చేశారు. ఆయన కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



ఆకుల షణ్ముఖరావును చంద్రబాబు సమక్షంలో పార్టీకిలోకి చేర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంతి

..8లో



నివాళులర్పిస్తున్న ఎస్పీ జగదీశ్

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పించిన ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మహనీయుడు డా.బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గం అనుసరణీయమని, ఆయన జీవితం ఆదర్శనీయమని ఎస్పీ జగదీశ్ కొనియాడారు. అంబేడ్కర్ 133వ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎస్పీ జగదీశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే ఈ రోజు భారతజాతిని నడిపిస్తోందన్నారు. మహామేధావిగా, సంఘ సంస్కర్తగా, న్యాయశాస్త్ర కోవిదుడిగా ఆయన కీర్తి గడించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని చెప్పారు. సమాజ సేవకు ప్రతిఒక్కరూ అంకితం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు పి.అనీల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, టి.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ డి.ప్రభాకర్, సీఐ సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న పురందేశ్వరి



అంబేడ్కర్ ఆశయాలకు జగన్

తిలోదకాలు

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన కూటమి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 14 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తిలోదకాలు ఇస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పురందేశ్వరి, తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం డాక్టర్ అంబేడ్కర్ కలలు కన్నారని, అంబేడ్కర్ ఆశయాలను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాజ్యాంగంలో ప్రాధాన్యం కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ అంబేడ్కర్ మహాశయుడు బడుగు, బలహీనవర్గాలు, మహిళలు కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు వెళ్లాలని సూచించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వైశ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్, దున్న సుమన్‌బాబు, సీహెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన వైసీపీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):



కొవ్వూరులో వైసీపీలోని ఇరువర్గాల మధ్య కొట్లాట

వైసీపీ నేతలు మరోసారి రోడ్డెక్కారు. ఈసారి ఏకంగా దెబ్బలాటకు దిగారు. కొవ్వూరులో ఆదివారం జరిగిన ఓ సమావేశం రసాభాసగా మారిన సంగతి తెలిసిందే.. తెలుగుదేశం పార్టీ జిల్లాలో అసంతృప్తులుగా ఉన్నవారినందరినీ సముదాయించి, పరిస్థితిని చక్కదిద్దుకుని, ప్రజల ముందుకు కూటమిగా దూసుకుపోతుంటే, అధికార వైసీపీకి మాత్రం ఇప్పటికీ ఇంటి పోరును సర్దుకోలేక పోతోంది. ఇప్పటికీ కనువిప్పు కలగలేదు. ఇప్పటికే అధికార వైసీపీ మీద ప్రజలకు పీకలవరకూ వ్యతిరేకత, తీవ్ర అసంతృప్తి ఉన్న సంగతి తెలిసిందే. అన్ని వర్గాలలో ఈ ప్రభుత్వ వైఖరిపై తిరుగుబాటు ధోరణి కనిపిస్తోంది. ఏదో కులాల పేరుతో పార్టీలలో చిచ్చుపెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నా, ఈసారి ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ధోరణితోనే కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ నేతలు ఐక్యంగా ఉండి ప్రజల మన్ననలు పొందే ప్రయత్నం చేయాలి.

కూటమిలో సర్దుబాట్లు..వైసీపీలో కుమ్ములాటలు



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలను ఆకర్షిస్తూ పోతుంటూ, ఈసారి కాంగ్రెస్ పార్టీ కూడా ఒక ఊపుతో ప్రచారం చేసుకుంటూ కొన్ని వర్గాలనైనా, చివరకు కొన్ని ఓట్లయినా కూడగట్టుకుని బలోపేతం కావాలని ప్రయత్నం చేస్తుంది. కానీ అధికార వైసీపీ మాత్రం వర్గాలు, గ్రూపులు కుమ్ములాటలతో రోజురోజుకు మరింత దిగజారిపోతోంది. ఈ ఐదేళ్లలోనూ జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ ఉన్నప్పటికీ ఎవరి మధ్య సయోధ్య లేదు. ఎవరి దారి వారిదే. ఆధిపత్య పోరుతో ఒకరిని ఒకరు ఓడించుకునే ఆలోచనకు కూడా రావడం గమ నార్హం. ఇవాళ కొవ్వూరులో ఏకంగా కొట్టుకునే స్థాయికి వచ్చారు. అక్కడ గతంలో ఇటువంటి ధోరణి లేదు. ఈనెల 18న సీఎం జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సుయాత్రలో జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.. రాష్ట్రవ్యాప్తంగా జనాలు ఉండడం లేదు. ఈనేపథ్యంలో జనసమీకరణ ఎలా జరపాలి.. గతంలో డ్వాక్రా మహిళలు, పెన్షన్ లబ్ధిదారులను నయానోభయానో రప్పించి, బస్సుల మీద తీసుకుని వెళ్లి, సభలో నిండుగా ఉండేటట్టు చూపించారు. అయినా మధ్యలో వారంతా వెళ్లిపోయేవారు. అప్పట్లోనే అటువంటి పరిస్థితి ఉంటే, ఇవాళ కేవలం పార్టీ క్యాడర్ తప్ప ఇంకెవరొస్తారు. ప్రజలలో అభిమానం ఉంటే వాళ్లయినా వచ్చేవారు. కానీ ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఈ పరిస్థితులలో కొవ్వూరులో జన సమీకరణ కోసం సమావేశమైన నేతల మధ్య ఏకంగా ఘర్షణకే దారి తీయడం అంటే వైసీపీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లా వైసీపీలో
కుమ్ములాటలు తారస్థాయికి
ప్రతి నియోజకవర్గంలోనూ
నాయకుల మధ్య విభేదాలే..
గ్రూపు తగాదాలు, ఆధిపత్య
పోరుతో అభాసుపాలు
నేతల మధ్య కుదరని సఖ్యత
సర్దుకునే దారే లేదు..

ప్రతి నియోజకవర్గంలోనూ ఏదో ఒక సమస్య

గోపాలపురం అభ్యర్థిగా పోటీ చేస్తున్న తానేటి వనిత, ఇక్కడ కొవ్వూరు నుంచి వెళ్లినా, అక్కడ కూడా గ్రూపులు పెడుతున్నారనే వాదన వినిపిస్తోంది. నిడదవోలు అభ్యర్థి శ్రీనివాసనాయుడు పార్టీ శ్రేణులను దగ్గర చేసుకోకుండా ఒంటెద్దు పోకడ ఎక్కువ ఉందనే ప్రచారం కూడా ఉంది. రాజమహేంద్రవరంలో సిటీ అభ్యర్థి ఎంపీ మార్గాని భరత్‌కు, సిటీలోని ముఖ్యనేతల మధ్య సఖ్యత లేదు. వారంతా ఇక్కడ ప్రచారం మానేసి వేరే నియోజకవర్గాలో ప్రచారం చేయడం గమనార్హం. రూరల్ అభ్యర్థిగా వేరే ప్రాంతానికి చెందిన మంత్రి చెల్లుబోయిన వేణును నిలబెట్టడంతో, స్థానికంగా నేతలు లేరా అనే వాదన బీసీ వర్గాలలో కూడా ఉంది. గతం నుంచి టికెట్ల కోసం ప్రయత్నించిన వారంతా పైకి మామూలుగానే ఉన్నా, తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంలో అక్కడ రెండుసార్లు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆకుల వీర్రాజును బలవంతంగా కోఆర్డినేటర్ పదవి నుంచి తొలగించి, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ కుమారుడు చందన నాగేశ్వర్‌కు కోఆర్డినేటర్ పదవి ఇవ్వడంతో పాటు, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇస్తానని దగా చేశారు. దీంతో ఆయన కూడా పైకి తేలకపోయినా అసంతృప్తితో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజానగరంలో జక్కంపూడి రాజాకు సొంత వర్గంలోనే సమస్యలు ఉన్నాయి. అనపర్తి అభ్యర్థి సూర్యనారాయణరెడ్డిని సొంత వర్గంలో కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల కొందరు ముఖ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇలా జిల్లాలో తీవ్ర విబేధాలతో వైసీపీ కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గాలలో ఈ గొడవలు ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు నిద్రలేకుండా చేయడం గమనార్హం.

కొవ్వూరులో వైసీపీ నేతల

కొట్లాట



కొవ్వూరులో పరస్పరం దాడులు చేసుకుంటున్న నాయకులు

రోడ్డెక్కి కొట్టుకున్న నాయకులు
వైసీపీలో బయటపడిన వర్గ విభేదాలు
నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్యే ముందు నాయకుల బాహాబాహీ
రెండు సామాజికవర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన వైనం

కొవ్వూరు, ఏప్రిల్ 14: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వైసీపీలో మరోసారి వర్గ విభేదాలు బయటపడ్డాయి. గత కొంతకాలంగా నియోజకవర్గంలో చాపకింద నీరులా ఉన్న వర్గాల మధ్య పోరు ఒక్కసారిగా బహిర్గతమయ్యింది. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ముఖ్యమంత్రి మేమంతా సిద్ధం పర్యటన, ఎన్నికలలో తలారి వెంకట్రావు నామినేషన్‌కు సంబంధించి నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో వేదికపై ఒక సామాజికవర్గానికే పెద్దపీట వేస్తున్నారని, మాజీ ఏఎంసీ ఛైర్మన్ బండి పట్టాభిరామారావును ఆహ్వానించరా అని పెద్దేవం ఉప సర్పంచ్ తోట రామకృష్ణ వేదికపైకి నాయకులను ఆహ్వానిస్తున్న వైసీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణను ప్రశ్నించారు. పరిశీలకులు రాజీవ్ కృష్ణ కంగారు పడకండి అందరిని పిలుస్తామని అనడంతో రామకృష్ణ వాగ్వివాదానికి దాగారు. దీంతో రామకృష్ణ పై హోంమంత్రి తానేటి వనితను వ్యతిరేకించిన వర్గం నాయకులు మూకుమ్మడిగా దాడిచేశారు. సాక్షాత్తు నియోజకవర్గ పరిశీలకులు రాజీవ్‌కృష్ణ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావుల ఎదుటే నాయకులు బాహాబాహీకి దిగారు. దీంతో కల్యాణ మండపం నుంచి బయటకు వచ్చేసిన తోట రామకృష్ణపె మరోసారి దాడి జరిగింది. రోడ్డెక్కి మరి కొట్టుకున్నారు. ఈ సంఘటనతో వేదికపై ఉన్న నాయకులంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

ఈ ఘర్షణపై తోట రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి బస్సు యాత్రకు సంబంధించి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. సభా వేదిక పైకి సీనియర్ నాయకులు మాజీ ఏఎంసీ ఛైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగధర శ్రీనివాస్‌లను పిలవలేదన్నారు. వేదికపైకి కాపు సామాజికవర్గం నుంచి ఎవ్వరికి ప్రాధాన్యం కల్పించలేదని ప్రశ్నించానని, మంత్రి వనితను వ్యతిరేకించిన వర్గానికి చెందిన వారంతా మూకుమ్మడి దాడి చేసి షర్ట్ చింపివేశారన్నారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు కలిగిన కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని నియోజకవర్గ పరిశీలకులుగా నియమించాలని ఇటీవల కాపు సామాజికవర్గ నేతలంతా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను కోరామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కక్ష పూరితంగా దాడి చేశారని తోట రామకృష్ణ చెప్పారు. హోంమంత్రి తానేటి వనితను వ్యతిరేకించిన వారే దాడికి పాల్పడ్డారన్నారు. పరిశీలకులు నియోజకవర్గ పరిస్థితులను గమనించాలన్నారు. నియోజకవర్గంలోని సామాజికవర్గ నాయకులతో చర్చించి సామాజికవర్గానికి జరిగిన అన్యాయంపై భవిష్యత్ కార్యాచరణ తెలియజేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్తామన్నారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ బండి పట్టాభి రామారావు మాట్లాడుతూ కొవ్వూరు వైసీపీలో కాపు సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఇది సరైంది కాదని అడిగిన తోట రామకృష్ణను ఒక సామాజిక వర్గం నాయకులంతా కలిసి దాడిచేసి దుర్భాషలాడడం సరికాదన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కాపులను విడదీస్తే టీడీపీ గెలుస్తుంది అని కొంతమంది కుట్ర చేస్తున్నారన్నారు.

నాడు కోడి కత్తి..నేడు గులకరాయి

రెండు డ్రామాలనూ రక్తికట్టించిన వైసీపీ
కోడి కత్తి శ్రీనును జైలు పాలు చేశారు
శవరాజకీయం కోసం అవ్వాతాతల ప్రాణాలు తీశారు
జగన్ డ్రామాపై మండిపడ్డ ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: నాడు కోడికత్తి, నేడు గులకరాయి డ్రామాలతో జగన్ ప్రజల్లో సానుభూతిని పొందాలని చూస్తున్నాడని రాజమహేంద్రవరం సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎంపై రాయి విసిరిన తర్వాత అక్కడే నిందితుడిని పట్టుకోలేకపోవడంలో విఫలమైన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సీపీ క్రాంతి రాణా టాటాలను వారి బాధ్యతల నుంచి ఎన్నికల కమిషన్ తొలగించాలని డిమాండ్ చేశారు. సీఎం పర్యటన సమయంలో పదేపదే కరెంట్ సరఫరా నిలిపివేయడం తీవ్రమైన నేరం అని దీనికి బాధ్యులైన ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సంబంధిత విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. గులకరాయి దాడిపై ఎన్ఐఏతో విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేత అవుతు శ్రీధర్ రెడ్డి ఈనెల 10న ఫేస్‌బుక్ పోస్టులో నాలుగురోజుల్లో రాష్ట్రంలో సంచలనమైన ఘటనలు జరిగే అవకాశం అనడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అతను చెప్పినట్లే సరిగ్గా నాలుగు రోజున విజయవాడలో సీఎం జగన్‌పై గులకరాయి దాడి జరగడం కోడి కత్తి డ్రామా లాంటి జగన్నాటకం కాదా అని ప్రశ్నించారు. జగన్‌పై గులకరాయి దాడి జరిగినప్పుడు అతని చుట్టు ఉన్న వైసీపీ కార్యకర్తలు, పోలీసులు వెంటనే నేరస్థుడిని ఎందుకు పట్టుకోలేదని ఇది ప్రీ ప్లాన్డ్ డ్రామా కాబట్టే పట్టుకోలేదని అన్నారు. చంద్రబాబుపై వైసీపీ మూక దాడి చేస్తే రక్షణ సిబ్బంది తక్షణమే బుల్లెట్ ప్రూఫ్ షీట్స్ అడ్డుపెట్టారని గుర్తుచేశారు. ఆ ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లోనే చంద్రబాబును దూషిస్తూ ప్లకార్డులతో వైసీపీ నేతలు రోడ్లపైకి వచ్చారని అప్పటికప్పుడు ప్లకార్డులు ఎలా వచ్చాయని ఇది ముందస్తు కుట్ర కాదా అని ప్రశ్నించారు. వైసీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు సానుభూతి కోసం కోడి కత్తి డ్రామాలు ఆడించి దళిత యువకుడిని జైలు పాలు చేసారన్నారు. నేడు శవరాజకీయాలు కోసం పింఛన్ల పంపిణీ ఆలస్యం చేయించి అవ్వాతాతల శవాలతో డ్రామాలాడారని మండిపడ్డారు. ఇప్పుడు గులకరాయి దాడితో మరోసారి సానుభూతి కోసం డ్రామాలకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి వాసు

ఇటువంటి సంస్కృతి మంచిది కాదు: గన్ని

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 14: ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడిపై భిన్నాభిప్రాయాలు ఉన్నా ఇటువంటి సంస్కృతి మంచిది కాదని దీనిని ఖండిస్తున్నానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు దుర్మార్గమైన చర్యలన్నారు. గతంలో చంద్రబాబుపై దాడి జరిగితే అప్పటి డీజీపీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయన్నారు. చంద్రబాబుపై ఎవరో కడుపుమండి ఈ విధంగా దాడి చేసి ఉంటారని ఆనాడు చేసిన వ్యాఖ్యలను వైసీపీ గుర్తుతెచ్చుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో కోడి కత్తి దాడి ద్వారా సానుభూతి పొందిన జగన్ ఇప్పుడు ఇలాంటి ప్రచారానికి తెర లేపుతున్నారా అనే సందేహం కలుగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఏది ఏమైనా ఇటువంటి సంస్కృతి మంచిది కాదన్నారు.



అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం

భగవద్గీతపై అష్టావధానం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 14: విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో గౌతమిఘాట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భగవద్గీత అష్టావధానం సాహితీప్రియులను అలరించింది. బల్లిపాడుకు చెందిన తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థి యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ఇప్పటివరకు 19 అవధానాలు చేసి 20వ అవధానం ఇక్కడ నిర్వహించారు. డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమానికి ధూళిపాళ మహదేవమణి సభా సంచాలకులుగా వ్యవహరించారు. అవధానం అనంతరం కవులకు, గౌతమ్‌ఘాట్ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులకు సత్కారం చేశారు. పీఠం శాఖ అధ్యక్షుడు ఎం.ఆర్.కె.రాజు, కార్యదర్శి డి.కృష్ణంరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వనపర్తి సత్యనారాయణ, శేఖర్, కలికి మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పి.వి.ఎస్.కృష్ణారావు, తోట సుబ్బారావు, సవితాల చక్రభాస్కరరావు, తరపట్ల సత్యనారాయణ సాహితీ ప్రియులు, పీఠం భక్తులు పాల్గొన్నారు.



గురువులకు సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 14: దేశీయ వారసత్వ సంపదగా నిలిచే భారతీయ సంప్రదాయ కళలను భావితరాలకు అందించే క్రమంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత అన్నారు. కలెక్టర్ విడిది కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళా దీక్షా గురువులను ఆమె సన్మానించారు. గురు శిష్య పరంపరను కొనసాగించే ప్రయత్నంలో భాగంగా కళాదీక్ష వార్షిక కార్యక్రమాన్ని పురస్కరించుకొని, హరికథ ప్రాచుర్యాన్ని భవిష్యత్తు తరాలకు అం దించటానికి నిర్వహిస్తున్న ఏడాది శిక్షణా కార్యక్రమం కలెక్టర్ ప్రారంభించారని కూచిపూడి నాట్య గురుకళారత్న డా.ఎస్.పి.భారతి తెలిపారు. రాజ మహేంద్రవరం నుంచి హరికథ గురువు శ్రీమతి పురాణం విజయలక్ష్మి, సహగురు రమాదేవి, కూచిపూడి నాట్యకారిణి డా.ఎస్.పి.భారతి సుదరన్‌లను సన్మానించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, ఏప్రిల్ 14: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, కుంకుమ పూజలు చేశారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. తదుపరి ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా, ఇతర టికెట్ల ద్వారా రూ.1,54,653 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

జగన్‌పై దాడికి ఖండన

కొవ్వూరు, ఏప్రిల్ 14: సీఎం జగన్‌పై జరిగిన దాడిని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఖండించారు. జగన్ 175కి 175 స్థానాలు గెలుస్తానని ధీమా వ్యక్తం చేయడం చూసి కూటమి ఉండబట్టలేక అక్కసుతో, రాజకీయంగా ఎదుర్కొలేక దాడులు చేస్తున్నారన్నారు. సత్తా ఉంటే ఎదుర్కొని గెలవాలి గాని హద్దుమీరిన పనులు సరికాదన్నారు. ఎన్నికల్లో జగన్ విజయం తథ్యమన్నారు.

ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు, ఏప్రిల్ 14: కొవ్వూరు ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో విశాఖపట్నం దివీస్ లాబ్స్ ప్రతినిధులు ఆదివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిని ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు ప్రారంభించారు. ఎమ్మెస్సీ, బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎం-ఫార్మసి, బి-ఫార్మసీ, డిప్లమో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు దివీస్ ప్రతినిధులు ఎ.రాజేష్, సీహెచ్ దుర్గాప్రసాద్, డి.శరత్ మౌఖిక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాంగణ ఎంపికల అధికారి కె.సూరిబాబు, పీజీ డైరెక్టర్ సీహెచ్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, ఏప్రిల్ 14: కొవ్వూరులోని పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయార్చకులు కౌతవరపు భాను ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన యనమండ్ర రమేష్‌బాబు, నాగలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంఆ గణపతిపూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, కుంకుమ పూజలు, బిల్వార్చన చేశారు. అనంతరం నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



నిడదవోలులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, యువత

నిడదవోలు, ఏప్రిల్ 14: నిడదవోలులోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. మొదటి రోజు అగ్నిప్రమాదాల్లో మరణించిన సిబ్బందికి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసరావు అగ్నిమాపక నివారణ చర్యల పోస్టర్‌ను ఆవిష్కరించారు. తదుపరి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక ఆలయం ప్రారంభం

ఉండ్రాజవరం, ఏప్రిల్ 14: వెలగదుర్రు గ్రామంలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో వినాయక ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపారు. బ్యాండు మేళాలు, వాయిద్యాల నడుమ వినాయకుని ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఊనగట్లలో భారీ అన్నదానం

చాగల్లు, ఏప్రిల్ 14: మండలంలోని ఊనగట్ల గ్రామంలో శ్రీపుంతలో ముసలమ్మ ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా అమ్మవారు ప్రతిరోజు విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు చేశారు. కాగా అన్నదాన ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దేవరపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



దేవరపల్లి, ఏప్రిల్ 14: దేవరపల్లిలో విశ్రాంత ఉద్యోగులు, మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 100మందికి కంటి పరీక్షలు చేసి 20మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి అందజేస్తామన్నారు. లీవర్‌వ్యాధితో బాధపడుతున్న యాదవోలుకు చెందిన పృధ్వీకి, కాలు, చెయ్యి విరిగిన దేవరపల్లికి చెందిన పెదప్రోలు మధులతకు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కన్వీనర్ వెంకటరాజకుమార్, కేసిరాజు సీతారామయ్య, ఈడ్పుగంటి నాగే శ్వరరావు, తీగల లక్ష్మీనారాయణ, పోతుల కాశి విశ్వనాథం, బండి సూర్యప్రకాశ రావు, పప్పు వెంకటరామారావు, లక్ష్మీప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో అన్ని రంగాలు అభివృద్ధి

దేవరపల్లి, ఏప్రిల్ 14: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని రంగాలు అభివృద్ధి సాధిస్తాయని పార్టీ నియోజకవర్గ అభ్యర్థి మార్టిన్ లూథర్ అన్నారు. మండలంలోని ధూమంతనగూడెంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్, వెలగా రామకృష్ణ, పిట్టా రామారావు, చాపల వెంకటేశ్వరరావు, సూరిబాబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

చీపురుగూడెంలో పొంచి ఉన్న ప్రమాదం

విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్ల నుంచి సప్లై



నల్లజర్ల, ఏప్రిల్ 14: మండలంలోని చీపురుగూడెంలో వినాయకుడి ఆలయం సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్ల నుంచి విద్యుత్ సరఫరా అయ్యి మంటలు వ్యాపిస్తున్నాయి. ఆదివారం కొందరు యువకులు పక్కనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద కూర్చొనేందుకు వెళ్లగా మంటల వ్యాపించడంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ స్తంభం నుంచి ఎర్త్ కోసం వేసిన వైర్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. సంబంధిత శాఖాధికారులు స్పందించి ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా స్త్రీల ఆదివారం

తాళ్లపూడి, ఏప్రిల్ 14: మండలంలోని అన్నదేవరపేటలో సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో స్త్రీల ఆదివారం నిర్వహించారు. ఏఈఎల్‌సీ చర్చిలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈస్టర్ తరువాత వచ్చే ఆదివారం స్త్రీల ఆదివారంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలో స్త్రీలందరూ కోలాట ప్రదర్శన చేశారు. రెవ. ప్రేమ్‌కుమార్, రెవ. రాజశేఖర్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో సినడు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితురాలైన జేడీ సునీతను ఘనంగా సత్కరించారు.



కొవ్వూరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ద్విసభ్య కమిటీ



నిడదవోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన కేవీపీఎస్ నాయకులు



తాళ్లపూడి: వేగేశ్వరపురంలో యువకులతో ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- టీడీపీ కొవ్వూరు ద్విసభ్య కమిటీ
- ఘనంగా బాబాసాహెబ్ జయంతి
- పలువురు నాయకులు, అధికారుల నివాళి

కొవ్వూరు, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పలుచోట్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు నాయకులు, అధికారులు నివాళులర్పించారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత, కుమారుడు ధరణ్, నాయకులు పెనుమాక జయరాజు, మరపట్ల కళాధర్ చక్రవర్తి, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, సూర్యదేవర రంజిత్, కేవీకే రంగారావు, జనసేన నాయకులు డేగల రాము, కె.నవ్య బీజేపీ నాయకులు బీవీ ముత్యాలరావు, గెల్లా కేశవ పాల్గొన్నారు. పార్టీ పార్లమెంటు కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మెరకవీధి 4వ వార్డులో ప్రజాస్వామ్యవాది బొంతా శ్యాం రవిప్రకాష్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీజీపీ పీవీ సునీల్‌కుమార్ విచ్చేసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కొవ్వూరు మండలం పంగిడి, దేచర్ల గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రస్టు ప్రతినిధి ఎం.ధనరాజు పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, బండి అబ్బులు, కోడూరి శివరామకృష్ణ, ఏలూరి విజయలక్ష్మి, బావన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో అంబేడ్కర్ విగ్రహానికి కేవీపీఎస్ నాయకుడు జువ్వల రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం, మనువాద పాలన అంతమొందించడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అని ఆయన అన్నారు. ఇప్పటికీ దేశంలోని దళితులపై దాడులు జరుగుతున్నాయని, దేశ లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ఈనాటి పాలకులు ప్రయత్నం చేయడాన్ని పౌర సమాజం, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో తూరుగోపు నాని, నల్లా లెనిన్, కుంచే అశోక్, బాలరాజు, యర్రా శ్రీను పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, భైపే రాజేశ్వరరావు, చప్పిడి బుజ్జి, వరసాల కృష్ణ, షాజహాన్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అధ్యక్షతన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఆర్ఐ కిషోర్, వీఆర్వోలు ప్రవీణ్, నాగేశ్వరరావు, సుజాత, లీలావతి పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోసిరాజు అధ్యక్షతన అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పైడిమెట్టలో జగ్జీవన్ సమాఖ్య డైరెక్టర్ దున్నా దుర్గారావు, అధ్యక్షుడు దేవరపల్లి రవి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కొప్పాక పోసియ్య, కొడమంచిలి చంద్రశేఖర్, జొన్నకూటి ప్రమోద్‌కుమార్, గెడ్డం రాజు, విజయరత్నం పాల్గొన్నారు. ప్రక్కిలంకలో అంబేడ్కర్ విగ్రహానికి యాళ్ల బాబూరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నివాళులర్పించారు. రాజ్యాంగం కారణంగానే దళితులు ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచులుగా పదవులు అనుభవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గూడా విజయరాజు, ఎంపీపీ పోసిరాజు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని పెద్దగూడెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్దగూడెం, వేళ్లచింతలగూడెం, పెద్దాపురం, కొవ్వూరుపాడు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి రవి, టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, చోళ్ల నాని, తానేటి రాఘవులు, రత్నబాబు, మొయ్యేటి శ్యాం, గంజి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో అంబేడ్కర్ కల్చరల్ యూనియన్ ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, మాజీ సర్పంచ్ గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, ఏసీ యూనియన్ నాయకులు, సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. అలాగే మండలంలోని వేలివెన్ను, కాల్ధరి, మోర్త, వెలగదుర్రు, తాడిపర్రు, పాలంగి, చివటం, సూర్యారావుపాలెం, వడ్లూరు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించారు.

చాగల్లు: చాగల్లులో రేడియో రూం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తలారి వెంకటరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కానూరు, తీపర్రు, పెరవలి, కాకరపర్రు. అన్నవరప్పాడు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా యువకులు బైక్‌ర్యాలీలు నిర్వహించారు.

దేవరపల్లి: దేవరపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, టీడీపీ, సీపీఎం నాయకులు పలువరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సువర్ణరాజు ఆధ్వర్యంలో అందరికి లడ్డూలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని, రాజ్యాంగం రచించి అన్ని వర్గాలు రాజకీయంగా, సామాజికంగా ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, సుంకర దుర్గారావు, కరుటూరి శ్రీనివాస్, సీపీఎం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని దేవరపల్లి, పల్లంట్ల గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సాయంత్రం భారీ ఊరేగింపు నిర్వహించారు.

నల్లజర్ల: నల్లజర్లలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ చలి వేంద్రాన్ని సీఐ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కిషోర్‌కుమార్, సర్పంచ్ పల్లి జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ వాదులు తమ పిల్లలకు రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించాలన్నారు. విద్య వల్ల కలిగే ప్రయోజనాలు, సమాజంలో జరుగుతున్న మార్పులను తెలియజేయ్యాలన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొందల శ్రీనివాసరావు, గుదే రాంబాబు, గుదే సుబ్బారావు, పల్లి సుబ్బారావు, గుదే శ్రీను తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో చెల్లు సుబ్రహ్మణ్యం, వీరవెంకట్రావు,గూళ్ళపూడి వెంకటరత్నం, చెల్లు హరిబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత: ఎస్‌బీ డీఎస్పీ

తాళ్లపూడి, ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతి సందర్భంగా వేగేశ్వరపురంలో బల్లిపాడు, వేగేశ్వరపురం యువకులకు ఎస్ఐ శ్యాం సుందర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్లను ఎస్‌బీ డీఎస్పీ ప్రభాకర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తిగా అందరూ చదువుకోవాలని, ఖాళీ సమయంలో మంచి పుస్తకాలు చదవాలని, ఆటలు నేర్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారొద్దని చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, సీఐ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్యాంసుందర్, స్థానికులు అక్కాబత్తుల శ్రీను, కె.అశోక్, వెంకటేష్, పూబా రవికుమార్, కంభం శివ, పల్లి రమణ, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

'నన్నయ' ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 14: ప్రపంచంలోని అన్ని దేశాల్లో కొనియాడబడుతున్న మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత పయనించాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని కేంద్ర గ్రంథాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి వీసీ పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడుగా ఎదిగి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే అంబేడ్కర్ నినాదంలోని అర్థాలను వివరించారు. వివిధ జాతులు, మతాలు ఉన్న భారతదేశానికి అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ నన్నయ వర్సిటీ రాజమహేంద్రవరం, కాకినాడ క్యాంపస్‌లలో అంబేడ్కర్ విగ్రహాలున్నాయని, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఏర్పాటుకు వీసీ ఆమోదించారన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెరవలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



దేవరపల్లిలో కేకు కట్ చేస్తున్న సువర్ణరాజు, టీడీపీ నాయకులు



నల్లజర్లలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ దుర్గాప్రసాద్



నన్నయ వర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ

గులకరాయి దాడి జగన్నాటకంలో భాగం

టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 14: నాడు కోడి కత్తి డ్రామా, గొడ్డలి వేటు కుట్ర, పింఛనుదారులతో శవరాజకీయాలు, నేడు గులకరాయి దాడి పేరిట సీఎం జగన్ నాటకాలకు తెరలేపాడని కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విమర్శించారు. మండలంలోని కొవ్వూరుపాడులో పెనుమత్స వెంకట నరశింహరాజు నివాసం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కుర్చీ మీద ఉన్న దాహంతో తండ్రి మరణించిన క్షణం నుంచి చిన్నాన్న వివేకానందరెడ్డిపై గొడ్డలి వేటు వేసే క్షణం వరకూ సానుభూతిని పొందేందుకు జగన్ వేసే డ్రామాలు జగన్నాటకంలోని భాగమేనన్నారు. మరోసారి రాష్ట్ర ప్రజలను మోసగించి సానుభూతి పొందేందుకు గులకరాయి డ్రామాకు తెరలేపారన్నారు. సీఎం ముందుస్తు జాగ్రత్తల వైఫల్యం, రాయి విసిరిన తరువాత నిందితులను పట్టుకోవడంలో విఫలమైన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సీపీ క్రాంతి రాణా టాటాలను ఎన్నికల కమిషన్ బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, నూతంగి దొరబాబు, ఉండవల్లి దుర్గాప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే గులకరాయి డ్రామా: ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, ఏప్రిల్ 14: ఓటమి భయంతో ఎన్నికల ముందు జగన్మోహనరెడ్డి పిచ్చిచేష్టలు ప్రజలకు అర్థమైపోయాయని, ఇంతకు ముందు కోడి కత్తి డ్రామాలానే ఎవ్వరూ నమ్మరని టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు అన్నారు. ఆదివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఓటమి భయంతో జగన్‌రెడ్డి సానుభూతి కోసం ఎన్నికల ముందు గులకరాయి డ్రామాను తెరమీదకు తీసుకువచ్చాడన్నారు. టీడీపీపై బురదజల్లాలని చూడడం సరికాదని, జగన్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ముప్పిడి సుజాత మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓడిపోతానని భయంతోనే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు అభివృద్ధే లక్ష్యం: దుర్గేష్



నిడదవోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 14: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం ఆయన నిడదవోలులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, బూరుగుపల్లి శ్రీనివాస్, తిరుపతి సత్యనారాయణ, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు. దుర్గేష్ గెలుపును ఆకాంక్షిస్తూ పలువురు జనసైనికులు విజ్జేశ్వరం నుంచి తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అలాగే పట్టణంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: కూటమి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీచేస్తున్న కందుల దుర్గేష్‌ను గెలిపించాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. దుర్గేష్ కుమార్తె రంగప్రియ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ముదునూరి రవీంద్రరాజు, పాతూరి నరేంద్రబాబు, వీరమళ్ల కృష్ణ, కాకర్ల కరుణాకర్, వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: రాబోయే ఎన్నికల్లో కూటమి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉసులుమర్రులో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్రం ఎంతో వెనుకబడి పోయిందని, కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో తులా ప్రసాద్, ఉప్పలపాటి సత్తిరాజు, తులా చినబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కానూరు, తీపర్రు, పెరవలి, ఖండవల్లి తదితర గ్రామాల్లో కూడా ప్రచారాలు నిర్వహించారు.

దొమ్మేరులో వివాహిత ఆత్మహత్య



కొవ్వూరు, ఏప్రిల్ 14: కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో ఓ వివాహిత ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. దొమ్మేరు అనంతలక్ష్మి కాలనీకి చెందిన దువ్వాపు వెంకటలక్ష్మి(30), గణేష్ భార్యాభర్తలు. వారికి ఓ అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. గణేష్ ప్రైవేటు ఎలక్ట్రికల్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యభర్తలు తరచుగా చిన్నచిన్న గొడవలు పడుతుంటారు. ఆదివారం డ్వాక్రా డబ్బుల విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో వెంకటలక్ష్మి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి పోసుకుని మృతి చెందింది. మృతురాలు తల్లి కట్టుంగ మంగ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



దున్నా ఠాగూర్ (ఫైల్‌ఫొటో)

నల్లజర్ల, ఏప్రిల్ 14: నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన దున్నా రవీంద్రనాథ్ ఠాగూర్(24)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఠాగూర్ ఆదివారం పొలం పనులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వస్తుండగా బైపాస్ రోడ్డులో డివైడర్‌ను ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్‌గురు
వై.స్క్రీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి

అప్పుల ఊబిలో రాష్ట్రం

టీడీపీ-జనసేన-బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి



నల్లజర్ల సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

దేవరపల్లి/నల్లజర్ల, ఏప్రిల్ 14: అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌ను జగన్‌రెడ్డి అప్పుల ఊబిలోకి నెట్టేశాడని టీడీపీ-జనసేన-బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి అన్నారు. దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాలులో నియోజకవర్గంలోని బీజేపీ ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలోను, నల్లజర్ల ప్రియాంక కన్వెన్షన్ హాల్లో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశాలకు ఆమె విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ మహిళలను పెట్రోల్ పోసి చంపేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య కలహాలు పెడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రజా ధనంతో కట్టిన భవనాలను తాకట్టు పెట్టే అధికారం జగన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అప్పుల మీద అప్పులు చేసి ప్రజలపై రుణ భారం మరింత పెంచుతున్నాడని పేర్కొన్నారు. ప్రధాని మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్ శక్తితో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులు కూటమీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. దేవరపల్లి సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివనాగరాజు, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు, కాట్రగడ్డ రవీంద్ర, పరిమి రాధాకృష్ణ పాల్గొన్నారు. నల్లజర్ల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, టీడీపీ నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాధ్యక్షులు తాతిన సత్యనారాయణ, అంద్రు అనిల్, రొగ్గల సత్యనారాయణ, నాయకులు నిమ్మలపూడి ప్రసాద్,ఏలేటి సత్యనారాయణ, కూచిపూడి ఉదయభాస్కర్, యలమాటి శ్రీను పాల్గొన్నారు.